క్లుప్తంగా

పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ గణేష్

బోనకల్: మే 13న నిర్వహించే పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు మండలంలో అన్ని ఏర్పాట్లు చేయాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ జి.గణేష్ సూచించారు. శనివారం స్థానిక తహసీల్‌లో సెక్టోరియల్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పోలీంగ్ బూత్‌లలో ఉండాల్సిన సౌకర్యాలు గురించి వివరించారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసిన సీ విజిల్ యాప్‌లో నమోదు చేయడం గురించి వివరించారు. కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవడానికి అవగాహన కల్పించాలన్నారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

ముదిగొండ: మండలంలోని బాణాపురం, వల్లబిలోని పదోతరగతి పరీక్షా కేంద్రాలను డీఈఓ సోమశేఖరశర్మ శనివారం తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల్లోని వసతులను పరిశీలించారు. పరీక్షల తీరును ఆయన పరిశీలించారు.

రాములోరి కల్యాణానికి గోటి తలంబ్రాలు



గోటి తలంబ్రాలతో భద్రాచలం వెళ్తున్న భక్తులు

ఏన్కూరు: భద్రాచలంలో జరిగే సీతారామకల్యాణానికి మండలంలోని రాజలింగాల, పీకే బంజరా, ఏన్కూరు, తూతకలింగన్నపేట, రేపల్లెవాడ గ్రామానికి చెందిన భక్తులు గోటితో వలచిని తలంబ్రాలతో పాదయాత్ర ద్వారా శనివారం భద్రాచలానికి తరలివెళ్లారు.

క్షయ నిర్మూలనకు కృషి చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సత్తుపల్లిరూరల్: క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరుతూ సీహెచ్‌ఓ ప్రమీలారాణి అన్నారు. శనివారం జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గంగారం పీహెచ్‌సీ వైద్యుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్షయ నిర్మూలనకు అందరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ సత్యనారాయణ, సిబ్బంది నాగమణి, సునీత, భవాని, మారేశ్వరి పాల్గొన్నారు.

సాగర్ జలాలతో చెరువులు నింపాలి

బోనకల్: వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు ఎండిపోతున్న ప్రస్తుత తరుణంలో సాగర్ జలాలతో చెరువులు నింపి పంటలను కాపాడాలని తెలంగాణ కౌలు రైతుల సంఘం ఉపాధ్యక్షుడు జక్కుల రామారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం బోనకల్‌లో ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాగులు, కుంటలు, బోర్లు ఎండిపోయి పొలాలకు పోయిన పశువులు, మనుషులు తాగేందుకు గుక్కెడు నీరు దొరక్క విలవిల లాడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, నాయకులు తూము రోషన్ కుమార్, కొండలరావు, ప్రసాదరావు, పవన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



అనిల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ముదిగొండ: మండలపరిధిలోని వల్లబిలో బిచ్చాల అనిల్ ఇటీవల మృతిచెందారు. ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, జెడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం శనివారం పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల నాయకులు పొట్ల ప్రసాద్, లక్ష్మారెడ్డి, ధనమూర్తి, అడ్వకేట్ బిచ్చాల తిరుమలరావు పాల్గొన్నారు.



పౌర్ణమి రోజున జరుపుకునే రంగుల పండుగకు వేళయింది. చిన్నా, పెద్ద.. తేడా లేకుండా రంగుల ప్రపంచంలో మునిగిపోతుంటారు. హోలీ.. హోలీల రంగ హోలీ.. చెమ్మకేళిన హోలీ అంటూ పాటలు పాడేందుకు ప్రజానీకం సిద్ధమైంది. స్నేహితులు, బంధువులంతా కలిసి ఆనందంగా గడుపుతారు. దీంతో సందడి వాతావరణం నెలకొననుంది.

హోలీకి వేళాయె..!



రంగులు కొనుగోలు చేస్తున్న ప్రజలు



వివిధ రకాల వాటర్ గన్‌లు

రేపు హోలీ సంబరాలు

సండే స్పెషల్

- రంగుల కొనుగోళ్లలో నిమగ్నమైన జనం
- దుకాణాల వద్ద నెలకొన్న సందడి
- సహజ రంగులు వినియోగించాలని అధికారుల సూచనలు

సత్తుపల్లిటౌన్: రంగులను ఒకరికి ఒకరు పూసుకోవడం.. రంగునీళ్ల చల్లుకుంటూ.. కోడిగుడ్లు తలపై వేస్తూ.. డీజే పాటలకు నృత్యాలు చేస్తూ జరుపుకునే రంగుల పండుగ హోలీ కేళీకి అంతా సిద్ధమైంది. ఈ పండుగ వచ్చిందంటే చాలు పిల్లలు, పెద్దలు ఎగిరి గంతేస్తారు. ఆదివారం ఉదయం నుంచి పౌర్ణమి గడియలు ప్రారంభం అవుతుండటంతో బంజార సంఘం ఆధ్వర్యాన ఆదివారమే హోలీ వేడుకలు జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. అయితే రాజస్థాని మార్వాడీలు మాత్రం సోమవారం ప్రత్యేకంగా నిర్వహించనున్నారు.

కొనుగోళ్ల సందడి..

హోలీ పండుగ కోసం వారం రోజుల ముందు నుంచే దుకాణాలలో రంగులు, వాటర్ గన్స్ ఏర్పాటు చేశారు. పిల్లలు ఆనందంగా రంగులు చల్లుకునేందుకు హోలీ గన్స్ కొనుగోలు చేయడానికి పోటీ పడుతున్నారు. దీంతో దుకాణాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. వీటితో పాటు వాటర్ బెలూన్స్ కూడా ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- కళ్లల్లో రంగులు పడకుండా కళ్లజోళ్లు ధరించాలి.
- హోలీ ఆడిన వెంటనే చేతులను శుభ్రంగా కడుక్కోవాలి.
- పొడవుచేతుల దుస్తులను ధరించటం మంచిది.
- చర్మవ్యాధులు, మొటిమలు ఉన్న వారు రంగులు పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. లేకుండా ఈ సమస్య మరింత ఎక్కువ అయ్యే అవకాశం ఉంది.

ఆనందంగా జరుపుకుంటాం..



హోలీ వేడుకలను సాంప్రదాయబద్ధంగా ప్రతి ఏటా నిర్వహిస్తాం. తెల్లవారుజామునే హోలీ మంటలు వేస్తాం. సంప్రదాయ నృత్యాలు చేస్తూ ఆనందంగా రంగులు చల్లుకుంటూ హోలీని వేడుకలు నిర్వహిస్తాం. డప్పు వాయిద్యాలతో స్వామికి నైవేద్యం సమర్పించి ఆనందంగా జరుపుకుంటాం.

– జి.రామకృష్ణ, బంజార సంఘం బాధ్యుడు

ఐక్యతను చాటుతూ..



ప్రతి ఏటా హోలీ వేడుకలను కాలనీలోని మహిళలంతా కలిసి చేసుకుంటాం. బంధువులను కూడా ఆహ్వానించి ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకుంటాం. కష్ట సుఖాలను పంచుకుంటూ ఐక్యతను చాటుకుంటూ ఆరాధ్యదైవం శ్రీరాముడిని కొలుస్తాం.

– ఎస్.తిరుమల, జలగంనగర్

అమ్మకాలు బాగున్నాయి..



హోలీ పండుగ కోసం వారం రోజుల నుంచే వివిధ రకాల వాటర్ గన్లు, పొరాణి విక్రయానికి సిద్ధం చేశాం. రెండురోజులుగా వీటి అమ్మకాలు జోరందుకున్నాయి. 30 రకాలకుపైగా వాటర్ గన్‌లు రూ.30 నుంచి రూ.250 వరకు అందుబాటులో ఉన్నాయి.

– దారా జగన్, వ్యాపారి, సత్తుపల్లి

- ఆనందం కోసం ఇతరులపైకి ఇబ్బంది కలిగించే విధంగా రంగులు చల్లకూడదు.
- రంగులు నోట్లోకి వెళ్లితే విరోచనాలు, వాంతులు అవుతాయి. వీటిలో రసాయనాలు ఉంటాయి. ఇవి చర్మానికి, కళ్లకు, శ్వాసకు ప్రమాదకరంగా మారుతుంది.
- పొడి రంగులతో కూడిన గాలిని పీల్చటం వల్ల శ్వాస సమస్యలు ఏర్పడతాయి.
- హోలీ పండుగ వేళ రంగులను ఉపయోగించటం వల్ల కళ్లు, చర్మంపైన ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉంటుంది.

రేషన్ సరుకులు సక్రమంగా అందించాలి

చింతకాని: రేషన్ సరుకులను వినియోగదారులకు డీలర్లు సక్రమంగా అందించాలని తహసీల్దార్ రమేష్ అన్నారు. శనివారం తహసీల్‌లో రేషన్ డీలర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్క డీలర్ రేషన్ దుకాణ లైసెన్స్ రెన్యూవల్ చేయించుకోవాలని సూచించారు. నిర్దేశించిన సమయంలో వినియోగదారులకు సరుకులను అందించాలని, ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలను ఉల్లంఘించవద్దని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వీరభద్ర నాయక్, ఆర్‌ఐ ఉష, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న వెంకటేశ్వర్లు

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు శనివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో కంభం సునీత, సూరబోయిన వినాయక, మార్కపూడి నవ్య, భైరు పర్వత, కంభం మాధవ, దేవర అచ్చమ్మ, కామిశెట్టి శివరామకృష్ణ లకు వైద్య ఖర్చుల నిమిత్తం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సిఫారసుతో మంజూరైన చెక్కులను అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబసభ్యులు భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కంభం వీరభద్రం, ఆలస్యం బస్వయ్య, ముత్తినేని వెంకటేశ్వరరావు, కంభం నాగేశ్వరరావు, కంభం నాగయ్య, వెచ్చా మంగపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా వేంకటేశ్వరుడి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వేంసూరు: శ్రీవారి కల్యాణ వేడుకలు భక్తులు కనుల పండువగా నిర్వహించారు. మండల పరిధిలోని కందుకూరులో కొలువుదీరిన వేకటేశ్వరస్వామి కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి సన్నజాజి, మల్లె, చామంతి, బంతి పూలతో భక్తులు అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ కల్యాణ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా అష్టలక్ష్మి వ్రతం



పూజలు నిర్వహిస్తున్న మహిళలు

చింతకాని: మండలంలోని కోమట్లగూడెం గ్రామంలో శ్రీశ్రీశ్రీ లక్ష్మీ అంకమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా అంకమ్మ తల్లి ఆలయంలో శనివారం అష్టలక్ష్మి వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి మహా అభిషేకం, అమ్మల ఊరేగింపు అనంతరం అంకమ్మ తల్లి స్వాములు అగ్ని గుండం తొక్కుట వంటి కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

టీకాలు తప్పనిసరి..



శిబిరంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

సత్తుపల్లి: చిన్నారులకు ఏడురకాల ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షించేందుకు తొమ్మిది రకాల వ్యాధినిరోధక టీకాలు తప్పని సరిగా వేయించాలని గంగారం పీహెచ్‌సీ వైద్యుడు ఆర్.అవినాష్ అన్నారు. శనివారం మండలంలోని పలు ఆరోగ్య ఉపకేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం మంజుల, ఎంఎల్‌హెచ్‌పీ పి.అనిత, అంగన్‌వాడీ టీచర్ రాజ్యలక్ష్మి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

చింతకాని: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎస్సై నాగుల్‌మీరా అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో శనివారం ఫ్లాగ్‌మార్చ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ బలగాలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటాచారికి సత్కారం



బదిలీ అయిన పీఓ వెంకటాచారిని సత్కరిస్తున్న సింగరేణి ఉద్యోగులు

సత్తుపల్లి: సత్తుపల్లి జేవీఆర్ ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్‌గా పనిచేసి కొత్తగూడెం సింగరేణి కార్పొరేట్‌కు బదిలీ అయిన ఎస్.వెంకటాచారికి స్థానిక జేవీఆర్ మైన్స్ గెస్ట్‌హౌస్‌లో శనివారం ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జేవీఆర్ ఓసీ పీఓ ఎస్‌వీఆర్ ప్రహ్లాద్, కిష్టారం పీఓ ఎంవి నర్సింహారావు, ఎస్‌ఓఎం పి.నర్సింహారావు, సెక్యూరిటీ ఇన్స్‌పెక్టర్ అజాముద్దీన్, జమెదార్ శ్రీనివాసరావు, రవీందర్‌రెడ్డి, సత్యనారాయణ, కనకయ్య పాల్గొన్నారు.

27నుంచి కుర్నవల్లిలో ప్రతిష్ఠా మహోత్సవాలు

తల్లాడ: ఈ నెల 27న తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామంలో అభయాంజనేయ, విఘ్నేశ్వర, నాభిశిల(బొడ్రాయి) ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. వెంకటచలపతి దేవస్థానంలో ఈ మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 27న ఉదయం 9 గంటల 45 నిముషాలకు ప్రతిష్ఠ వేడుకలు వైభవంగా జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 25 నుంచి ఆలయంలో పూజా కార్యక్రమాలు ప్రారంభమౌతాయని తెలిపారు. ఈ సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ పేర్కొంది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఏన్కూరు: నేడు మండలంలో మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ఉమకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రాయమాదారం, ఎర్రబోడుతండా, బుదరాఘవాపురం, పీకే బంజర, పెనంపల్లి తండా, రాజలింగాల, కోదడంరామాపురం తండా గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పోషకాహారం తీసుకోవాలి



కల్లూరురూరల్: సీమంతం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

వేంసూరు/సత్తుపల్లిరూరల్/కల్లూరురూరల్: గర్భిణులు, బాలింతలు పోషకాలతో కూడిన ఆహారపదార్థాలను తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవాని, ఐసీడీఎస్ సీడీపీఓ ఎ.కొండమ్మ, కల్లూరు ప్రాజెక్ట్ సీడీపీఓ కృష్ణకుమారి తెలిపారు. శనివారం వేంసూరు మండలంలోని చిన్న మల్లెలలో, సత్తుపల్లి పట్టణంలోని మసీద్‌రోడ్ అంగన్‌వాడీ కేంద్రంలో, కల్లూరులోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం పోషణ పక్వాడ్ పక్షోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతీ తల్లి పోషకాలతో కూడిన ఆహారం, డ్రైఫ్రూట్స్, చిరుధాన్యాలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సామూహిక సీమంత వేడుకలు, అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు పి.దుర్గాభవాని, ఎం.నిర్మల, కృష్ణకుమారి, పద్మ, ఆయాలు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి రానివ్వొద్దు



మాట్లాడుతున్న ఏఈ సతీష్

కొణిజర్ల: వేసవిలో మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా అధికారులు తగినక జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ గోసు మధు సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. గ్రామాల్లో ఇప్పటికే తాగునీటి సమస్య ఉందన్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్ మాట్లాడుతూ.. మండలంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని, మిషన్ భగీరథ నీళ్లతో పాటు ప్రత్యామ్నాయంగా బోర్లు, బావుల నుంచి నీరు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అనంతరం ఎన్నికల కోడ్ ఉన్నందున సమావేశాన్ని ముగిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రోజారాణి, మండల అధికారులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను సాధించాలి



విద్యార్థినులకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లిరూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. సత్తుపల్లి మదర్‌థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవ వేడుకల్లో శనివారం రాత్రి ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులకు కళాశాల యాజమాన్యం కల్పిస్తున్న శాస్త్ర, సాంకేతిక, మౌళిక సదుపాయాల పట్ల అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేని కళాశాల యాజమాన్యం సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ, కరస్పాండెంట్ సాంబశివరావు, చైర్మన్ సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్‌రావు, డైరెక్టర్లు సత్యనారాయణ, కృష్ణారావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ కుమార్‌రాజా, బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్‌వీఆర్ దీక్షితులు, అగ్రికల్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అజయ్‌కుమార్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాలలో ల్యాంప్ లైటింగ్, క్యాపింగ్



నర్సింగ్ విద్యార్థినులతో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి మండలం కిష్టారంలోని ప్రభుత్వ బీఎస్సీ నర్సింగ్ కళాశాలలో శనివారం ల్యాంప్ లైటింగ్, క్యాపింగ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగ్ విద్యార్థినులు దీపారాదనతో ఫ్లోరెన్స్ నైటింగేల్ ప్రతిజ్ఞ చేశారు. ఈ నెల 26 నుంచి సత్తుపల్లి ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో శిక్షణతో పాటు రోగుల సేవలు అందిస్తారని జిల్లా మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కెబి జ్యోతి, డాక్టర్లు శివకృష్ణ, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.విజయలక్ష్మి, కె.మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం



మధిరరూరల్: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వీరబాబు

మధిర/మధిరరూరల్: మధిర పట్టణంలోని బోడెపుడి భవన్‌లో బోడెపుడి సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో వైద్యులు వేమిరెడ్డి అయ్యప్పరెడ్డి పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సంస్థ ఆధ్వర్యంలో షుగర్, బీపీ తదితర జబ్బులకు నెలకు సరిపడా వంద రూపాయలకే మందులు అందజేశారు. రోగులకు అందుబాటులో ఉంటూ ఉచితంగా వైద్య సేవలు అందించిన డాక్టర్ అయ్యప్పరెడ్డిని సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అదే విధంగా మధిరలోని వంగవీడు గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో మాటూరుపేట పీహెచ్‌సీ వైద్యాధికారి వీరబాబు పాల్గొని రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో శీలం నరసింహారావు, ప్రభాకర్, మురళి, మధు, రాధాకృష్ణ, వైద్య సిబ్బంది భాస్కరరావు, ప్రదీప్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడాలి

కేంద్రంలో అధికారంలో ఉన్న ఆర్‌ఎస్‌ఎస్ బీజేపీ మతతత్వ మనువాద మారణకాండకు వ్యతిరేకంగా భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో యువత పోరాడాలని వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శనివారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతిని పురస్కరించుకుని వారి చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాగడాలతో ప్రదర్శన నిర్వహించి యువతలో స్ఫూర్తి నింపారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం వంటి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ నెల 23 నుంచి 31 వరకు గ్రామగ్రామాన భగత్‌సింగ్ వర్ధంతి వేడుకలు నిర్వహిస్తున్నామని, భగత్‌సింగ్‌కు భారతర్న ఇవ్వాలని డిమాండ్ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



మధిర: నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు



వైరా: మాట్లాడుతున్న పీవైఎల్ నాయకురాలు శిరీష



పెనుబల్లి : వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు



కారేపల్లి: నివాళులర్పిస్తున్న మాస్‌లైన్ నాయకులు